సోమవారం
MONDAY
12-10-2026
జగిత్యాల JAGITIAL || పేజీలు:8 PAGES:8 || వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 || సంచిక: 104 Issue: 104
Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385
# నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com



అరచేతిలో ఈవార్తలు దినపత్రిక
స్కాన్ చేయండి..
ఆండ్రాయిడ్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play


5. The promotion of the above individuals is:

(i) Purely on temporary basis without having any right to claim the seniority in the cadre of Leading Fire Fighter and subject to outcome of Court Cases /Orders if any filed on the subject matter.



తెలంగాణ అగ్నిమాపక శాఖలో పదోన్నతుల వ్యవహారం మరో కీలక ప్రశ్నను ముందుకు తెచ్చింది. ఫైర్ ఫైటర్ టెక్నికల్ విభాగానికి చెందిన కొందరిని లీడింగ్ ఫైర్ ఫైటర్లుగా (ఎల్‌ఎఫ్‌వో) పదోన్నతి కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లోనే.. ఆ పదోన్నతులు తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయని, సంబంధిత అంశంపై దాఖలయ్యే కోర్టు కేసులు లేదా ఆదేశాల ఫలితాలకు లోబడి ఉంటాయని పేర్కొనడం చర్చనీయాంశమైంది. ఒకవైపు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (ఎస్‌ఎఫ్‌వో) శిక్షణ పూర్తి చేసినందున ఎల్‌ఎఫ్‌వో శిక్షణకు బదులుగా ఆ కోర్సును పరిగణనలోకి తీసుకుని పదోన్నతులు కల్పించినట్లు ఉత్తర్వులు చెబుతున్నాయి.

# చట్టాన్నీ చుట్టేశారు..?

### ఫైర్ సిబ్బంది పదోన్నతుల్లో మెలిక..?
### చర్చనీయాంశంగా ఎల్‌ఎఫ్‌వో పదోన్నతులు
### ఎస్‌ఎఫ్‌వో శిక్షణతో ఎల్‌ఎఫ్‌వోలుగా ప్రమోషన్లు
### కోర్టు ఫలితాలకు లోబడేనని ఉత్తర్వుల్లో ప్రస్తావన
### రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై కవిత మండిపాటు
### ఫైర్ ఫైటర్స్‌కు అన్యాయం చేయొద్దని హితవు

(ఈవార్తలు - ఇన్వెస్టిగేటివ్ స్టోరీ)

మరోవైపు, ఈ పదోన్నతులకు సంబంధించి న్యాయపరమైన పరిణామాల ప్రస్తావన కూడా ఉంది. అసలు ఈ పదోన్నతుల విధానానికి నిబంధనల్లో స్పష్టమైన ఆధారం ఉందా? ఉంటే, కోర్టు కేసుల ఫలితాలకు లోబడి ఉంటాయని ప్రత్యేకంగా ఎందుకు పేర్కొనాల్సి వచ్చింది? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత ఏప్రిల్‌లో విడుదల చేసిన పదోన్నతి ఉత్తర్వులో తెలిపిన వివరాల ప్రకారం.. సంబంధిత ఉద్యోగుల పదోన్నతులు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయి. లీడింగ్ ఫైర్ ఫైటర్ కేడర్‌లో సీనియారిటీని కోరే హక్కు ఉండదని, ఈ అంశంపై ఏవైనా కోర్టు కేసులు లేదా ఆదేశాలు ఉంటే వాటి ఫలితానికి పదోన్నతులు లోబడి ఉంటాయని పేర్కొన్నారు. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. పదోన్నతులకు సంబంధించిన అర్హతలు, శిక్షణ, మినహాయింపుల విషయంలో తరువాయి 2 వ పేజీలో...



# బారికేడ్లు బద్దలు!



## వెంటనే అడ్డు తొలగించండి

### మెట్రో నడపండి.. ఇంటర్నెట్‌పై ఆంక్షలొద్దు
### కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్ల తో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై తరువాయి 2 వ పేజీలో...

అమెరికా దక్షిణ ప్రాంతాన్ని తాకిన ఇసాయాన్ హరికేన్ తీవ్రమైన ఈదురు గాలులు, భారీ వర్షాలతో విధ్వంసం సృష్టించింది. గంటకు168 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలుల ప్రభావానికి పలు చెట్లు నేల కూలాయి. భవనాల పైకప్పులు ఎగిరిపోయాయి. ఈ విపత్తు కారణంగా ఫ్లోరిడా, అలబామా రాష్ట్రాల్లో దాదాపు 9 లక్షల మంది అంధకారంలో చిక్కుకున్నారు.

# గోవా నుంచే హైదరాబాద్‌కు డ్రగ్స్

### దేశంలోని ప్రధాన నగరాలకు అక్రమ రవాణా
### ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు
### గోవాలో టీజీ సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్స్' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



పనాజీ: బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తరువాయి 2 వ పేజీలో...



# యాసంగి పంట వద్దు

### నీళ్లు లేవ్.. ఎల్‌నినో ప్రభావం ఎక్కువుంది
### ఉన్న పంటను కాపాడ్డానికే ఇబ్బందవుతుంది
### మంత్రి పొంగులేటి

పాలేరు, అక్టోబర్ 11 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావం వల్ల ఉన్న పంటలనే కాపాడ్డానికి ఇబ్బందులు పడుతున్నామని.. ప్రభుత్వం మాట విని యాసంగి పంట వేయొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రైతులను కోరారు. రాష్ట్రంలో తీవ్ర జల వనరుల సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, వీబీజీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో అదనపు పనిదినాలు కల్పించాలని కేంద్రాన్ని కోరతామన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఆదివారం పర్యటించి తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,142 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,196 |



కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి ఆలయంలో అంగరంగ వైభవంగా జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఈ ఉత్సవాలకు నాందిగా అర్చకులు వైఖానస ఆగమ ప్రకారం ఈ ఘట్టాన్ని నిర్వహించారు. ఉత్సవాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతం కావాలని శ్రీవారిని ప్రార్థిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.



దేశవ్యాప్తంగా దసరా శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై మొదటి రోజు దుర్గమ్మ..బాలాత్రిపురసుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలిరోజు తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకార పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఆలయ చైర్మన్, ఈవో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో శాస్త్రోక్తంగా చండీ హోమం ప్రారంభ పూజలు నిర్వహించారు.

## విశ్వవాణి



కంటి రెటీనాలోని మార్పుల ద్వారా అల్జీమర్స్ వ్యాధి ముప్పును ముందుగానే గుర్తించే అవకాశం ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. యూకే బయోబ్యాంక్‌కు చెందిన 44,501 మంది కంటి రెటీనా చిత్రాలను పరిశోధకులు కృత్రిమ మేధ ఆధారిత లోతైన అభ్యసన పద్ధతులతో విశ్లేషించారు. వయసు, ధూమపానం, నిద్ర సమస్యలు, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు సహా 12 అంశాలకు సంబంధించిన సంకేతాలను గుర్తించారు. తరువాత అల్జీమర్స్ బారినపడిన వారిలో రెటీనాలోని సూక్ష్మ రక్తనాళాలు సన్నబడటం, చూపు నాడి చుట్టూ మార్పులు కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు.

# పడవ ప్రమాదంలో 109 మంది మృతి

### ఆఫ్రికా తీరంలో పెను విషాదం

3

### వలసదారులతో వెళుతున్న పడవ బోల్తా
### 116 మంది ఆచూకీ గల్లంతు
### జిబౌటి నుంచి యెమెన్‌కు వెళుతుండగా దుర్ఘటన





# చిన్నారులు, గర్భిణి సహా 8 మంది కాల్చివేత

### ఆపై ఆత్మహత్య చేసుకున్న దుండగుడు
### అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఘోరం

ఎరీ: అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఎరీ నగరంలో జరిగిన దారుణ ఘటనలో ఓ వ్యక్తి ఎనిమిది మందిని కాల్చి చంపి, ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, 8 నెలల గర్భిణి కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం తరువాయి 2 వ పేజీలో...

# రైల్వేలో 3,548 ఉద్యోగాలకు నోటిఫికేషన్

### గ్రాడ్యుయేట్ లెవల్ ఎన్టీపీసీ పోస్టుల భర్తీ

3

### అత్యధికంగా 2,750గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు

# రాశి ఫలాలు



12-10-2026

మేషం: మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. నూతన కార్యక్రమాలకు అవరోధాలు తొలగుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆప్తుల నుండి అందిన శుభవార్తలు కొంత ఉత్సాహాన్నిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక లాభాలు అందుకుంటారు.

వృషభం: వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. బంధువులతో వివాదాలు చికాకు పరుస్తాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు.

మిధునం: ఉద్యోగులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. బందు మిత్రులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

కర్కాటకం: నూతన వాహన యోగం ఉన్నది. వ్యాపార, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వ్యక్తులతో పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. ఋణదాతల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. బంధువర్గం నుండి విలువైన సమాచారం అందుతుంది.

సింహం: కొన్ని వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలసిరావు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. దైవ సేవా కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు కొంత చికాకు పరుస్తాయి. బంధువులతో మాట పట్టింపులు ఉంటాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

కన్య: వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. అధికారులతో సఖ్యత కలుగుతుంది. కుటుంబ పెద్దల నుండి అవసరానికి ధనసహాయం అందుతుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు అధిగమిస్తారు.

తుల: వ్యాపారాల విస్తరణకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం నుండి ఉపశమనం కలుగుతుంది. బంధువర్గం నుండి శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. జీవిత భాగస్వామితో దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సంతాన విద్యా విషయాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు.

వృశ్చికం: సహోద్యోగులతో మాటపట్టింపులు తొలగుతాయి. ఇంటాబయట అనుకూల పరిస్థితులు ఉంటాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఇతరుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

ధనస్సు: విందువినోద కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. ఇంటా బయట అకారణ వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలు నిరుత్సాహ పరుస్తాయి. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు.

మకరం: కుటుంబమునకు కొందరి ప్రవర్తన వలన శిరోబాధలు తప్పవు. చేపట్టిన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. నూతన ఋణాలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో నిరాశ తప్పదు. ముఖ్యమైన వ్యవహారాలలో శ్రమకు ఫలితం కనిపించదు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు తొలగుతాయి.

కుంభం: వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

మీనం: వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో కలహ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. ఉద్యోగమున అధికారులతో వివాదాలు తప్పవు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ధనపరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి.

# బారికేడ్లు బద్దలు!



మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## సీజేపీ నేతల విడుదల

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కి వ్యతిరేకంగా నిరసనలకు సిద్ధమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేతలను ఢిల్లీ పోలీసులు విడుదల చేశారు. ఏడాది పాటు శాంతియుతంగా, మంచి ప్రవర్తనతో మెలగాలనే షరతుపై వారిని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు. రూ.50,000 పూచీకత్తుతో కూడిన బెయిల్ బాండ్‌పై వారిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. సీజేపీ నేతలు అభిజీత్ డిప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు కోర్టు షరతులతో కూడిన విడుదల మంజూరు చేసిందని ఆ పార్టీ న్యాయవిభాగం అధిపతి రత్న సింగ్ ధ్రువీకరించారు. శనివారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగుపెట్టగానే, ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ఈరోజు కోర్టులో హాజరుపరచగా, ఈ మేరకు ఆదేశాలు వెలువడ్డాయి.

### నేడు సుప్రీంకోర్టుకు కాంగ్రెస్ మార్చ్: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: ఓట్ల చోరీకి వ్యతిరేకంగా, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ సోమవారం ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపట్టనుంది. అందులో భాగంగా సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించి, భారత ప్రజల తరఫున ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం సమర్పిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఈ మార్చ్‌లో యువత, ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రాహుల్ పిలుపునిచ్చారు. ఓట్ల చోరీకి ముగింపు పలకాలని, సర్ ప్రక్రియను నిలిపివేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు కూడా ఢిల్లీకి చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, సుమారు 60 మంది ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం.



# చట్టాన్నే చుట్టేశారు..?

మొదటి పేజీ తరువాయి

ఎలాంటి వివాదం లేకుండా స్పష్టమైన నిబంధనలను అమలు చేశారా? లేక ఈ నిర్ణయంపై అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉందని భావించి తాత్కాలిక షరతు చేర్చారా? ఈ ప్రశ్నలకు ఉత్తర్వు ఒక్కటే సమాధానం ఇవ్వడం లేదు. అందువల్ల సంబంధిత ఫైళ్లు, నిబంధనలు, అనుమతుల వివరాలను శాఖ వెల్లడించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

### ఎస్ఎఫ్‌వో శిక్షణ ఉంటే.. ఎల్ఎఫ్‌వో శిక్షణ అవసరం లేదా?

ఫైర్ ఫైటర్ టెక్నికల్ కేటగిరీ నుంచి ఎల్ఎఫ్‌వోగా పదోన్నతి పొందేందుకు నిర్దేశించిన శిక్షణకు బదులుగా, ఇప్పటికే ఎస్ఎఫ్‌వో కోర్సు పూర్తి చేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తర్వులో పేర్కొనడం మరో ముఖ్యమైన అంశం. ఎస్ఎఫ్‌వో కోర్సు ఉన్నత స్థాయి శిక్షణ కావచ్చనే వాదనను శాఖ ముందుకు తెస్తే.. దానిని ఎల్ఎఫ్‌వో శిక్షణకు ప్రత్యామ్నాయంగా పరిగణించేందుకు నిబంధనల్లో ఏదైనా వెసులుబాటు ఉందా? లేక ప్రత్యేక అనుమతితోనే ఈ నిర్ణయం తీసుకున్నారా? అన్నది తెలపాలని ఫైర్ ఫైటర్స్ కోరుతున్నారు. అర్హతల విషయంలో ఒక ఉద్యోగికి ఒక ప్రమాణం, మరొకరికి మరో ప్రమాణం ఏంటని అంటున్నారు. ఉత్తర్వులో తాత్కాలిక షరతు ఎందుకు చేర్చారో, ఏ పరిస్థితుల్లో ఈ పదోన్నతులను వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుందో శాఖ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఫైర్ ఫైటర్స్‌కు అన్యాయం చేయొద్దు: కవిత

ఫైర్ శాఖ పదోన్నతుల వ్యవహారంపై కవిత వీడియో ద్వారా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగుల అర్హతలు, పదోన్నతుల విధానం, ఉత్తర్వుల అమలుపై తలెత్తుతున్న సందేహాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని టీఆర్ఎస్ చీఫ్ కవిత డిమాండ్ చేశారు. 10 ఏళ్లకు మించి సర్వీస్ చేస్తున్న వారికి అన్యాయం చేయడం తగదని అన్నారు. చట్టబద్ధమైన అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

### ఉద్యోగుల ప్రశ్నలు

- ఎల్ఎఫ్‌వో పదోన్నతికి నిర్దేశించిన శిక్షణకు బదులుగా ఎస్ఎఫ్‌వో కోర్సును పరిగణించేందుకు ఏ నిబంధన ఆధారం?
- ఈ మినహాయింపుకు డీజీ అనుమతి మాత్రమే సరిపోతుందా?
- పదోన్నతులు తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయని, కోర్టు కేసుల ఫలితాలకు లోబడి ఉంటాయని ఎందుకు పేర్కొన్నారు?
- ఈ పదోన్నతులపై ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు లేదా న్యాయపరమైన సూచనలు వచ్చాయా?
- సమాన అర్హతలు ఉన్న ఇతర ఉద్యోగులకూ ఇదే విధానం వర్తిస్తుందా?
- ఈ నిర్ణయం వల్ల సీనియారిటీ, భవిష్యత్ పదోన్నతులపై ఎలాంటి ప్రభావం ఉంటుంది?
- కొత్త సర్వీస్ రూల్స్ అమలులో పాత ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుంది?

# చిన్నారులు, గర్భిణి సహా 8 మంది కాల్చివేత

మొదటి పేజీ తరువాయి

ఎరీ నగరంలోని ఓ వీధిలో ఒక వ్యక్తి తుపాకితో కాల్పులు జరుపుతూ ఇంట్లోకి ప్రవేశించాడని స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు ఇంటి బయట ఇద్దరు మహిళల మృతదేహాలు కనిపించాయి. ఆ తర్వాత ఇంట్లోకి ప్రవేశించగా, అక్కడ మరో ఆరుగురి మృతదేహాలతో పాటు నిందితుడి మృతదేహం కూడా లభ్యమైంది. విచారణలో భాగంగా పోలీసులు వీడియో ఫుటేజీని పరిశీలించారు. ఇంటి బయట చనిపోయిన 51, 37 ఏళ్ల వయసున్న ఇద్దరు మహిళలు.. నిందితుడి నుంచి తప్పించుకుని ఇరుగుపొరుగు వారి సాయం కోరడానికి ప్రయత్నించినట్టు అందులో రికార్డయింది. అయితే, నిందితుడు బయటకు వచ్చి వారిద్దరినీ కాల్చి చంపినట్లు పోలీసులు గుర్తించారు. ఇంట్లో మొదటి అంతస్తులో ఐదేళ్లు, ఏడాది వయసున్న ఇద్దరు చిన్నారుల మృతదేహాలను, రెండో అంతస్తులో 24, 44 ఏళ్ల వయసున్న ఇద్దరు మహిళలు, 19, 21 ఏళ్ల వయసున్న ఇద్దరు యువకుల మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో ఒకరు మినహా అందరూ బంధువులేనని ఎరీ పోలీస్ చీఫ్ రిక్ లోరా తెలిపారు. ఈ దారుణానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదని, అయితే నిందితుడి మానసిక సమస్యలే ఈ దారుణానికి కారణమై ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. "కొన్ని దృశ్యాలు మనల్ని జీవితాంతం వెంటాడతాయి. ఇది అలాంటి ఘటనే" అని ఆవేదన వ్యక్తం చేశారు.

# రైల్వేలో 3,548 ఉద్యోగాలకు నోటిఫికేషన్

### నవంబర్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ కింద 3,548 ఉద్యోగాల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. రైల్వే కార్యకలాపాలు, పరిపాలనలోని వివిధ విభాగాల్లో పనిచేసేందుకు గ్రాడ్యుయేట్లకు ఇది ఒక గొప్ప అవకాశమని ప్రకటనలో పేర్కొంది. ఈ రిక్రూట్‌మెంట్ ద్వారా మొత్తం నాలుగు కేటగిరీలలో పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో అత్యధికంగా 2,750 గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు ఉండగా, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులు 371, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ పోస్టులు 300, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టులు 127 ఉన్నాయి. కమర్షియల్, ట్రైన్ ఆపరేషన్స్, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడవ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ప్రకారం వేతనాలు ఉంటాయి. చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టుకు పే లెవల్ 6 కింద రూ.35,400 ప్రారంభ మూల వేతనం లభిస్తుంది. మిగిలిన మూడు కేటగిరీల (గూడ్స్ ట్రైన్ మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్, సీనియర్ క్లర్క్) పోస్టులకు పే లెవల్ 5 కింద రూ.29,200 ప్రారంభ మూల వేతనం ఉంటుంది. వీటికి అదనంగా ఇతర అలవెన్సులు కూడా వర్తిస్తాయి. అక్టోబర్ 8న ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ, నవంబర్ 6 రాత్రి 11:59 గంటలకు ముగుస్తుంది. పరీక్ష ఫీజు చెల్లించడానికి నవంబర్ 8 చివరి తేదీ కాగా, దరఖాస్తులో మార్పులు చేసుకునేందుకు నవంబర్ 9 నుంచి 18 వరకు అవకాశం కల్పించారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2027 జనవరి 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి. నిబంధనల ప్రకారం రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.



# యాసంగి పంట వద్దు

మొదటి పేజీ తరువాయి

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'ఇప్పటికే రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంట వేసి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. రెండో పంట వేసి, నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని, ప్రభుత్వ సూచనలను పాటించాలి. ఎల్‌నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ బృందం ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తాం. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా కృషి చేస్తాం' అని పొంగులేటి పేర్కొన్నారు.

# పడవ ప్రమాదంలో 109 మంది మృతి

న్యూఢిల్లీ: ఆఫ్రికా తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. మెరుగైన భవిష్యత్తు కోసం వలస వెళుతున్న వారి జీవితాలు సముద్రంలో కలిసిపోయాయి. సుమారు 350 మందితో ప్రయాణిస్తున్న ఒక పడవ బోల్తా పడిన ఘటనలో 109 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15 మంది చిన్నారులు కూడా ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అంతర్జాతీయ వలసల సంస్థ ఆదివారం ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 8-9 మధ్య రాత్రి సమయంలో జిబౌటి నుంచి యెమెన్‌కు వలసదారులతో ఈ పడవ బయలుదేరింది. జిబౌటిలోని ఒబాక్ పోర్ట్ పట్టణానికి ఉత్తరాన ఉన్న గుహెరే సమీపంలోకి రాగానే పడవ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 109 మృతదేహాలను వెలికితీశారు. వీరిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు (తొమ్మిది మంది బాలికలు, ఆరుగురు బాలురు) ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడగా, వారందరూ ఇథియోపియా జాతీయులని ఐఓఎం తెలిపింది. వీరిలో 64 మందికి ఒబాక్‌లోని తమ మైగ్రెంట్ రెస్పాన్స్ సెంటర్‌లో ఆశ్రయం కల్పించి, అవసరమైన సహాయం అందిస్తున్నట్లు పేర్కొంది. జిబౌటియన్ అధికారులు గల్లంతైన వారి కోసం గాలింపు మరియు సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. పడవ మునిగిపోవడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై జిబౌటిలోని ఐఓఎం చీఫ్ ఆఫ్ మిషన్ అలెగ్జాండర్ కోయిసాక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఇది హృదయ విదారకమైన ప్రాణ నష్టం. గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో వేలాది మంది వలస జీవులు ప్రయాణించే ఈ మార్గంలో ఉన్న ప్రమాదాలకు ఈ ఘటన అద్దం పడుతోంది" అని ఆయన అన్నారు. ఐఓఎం మిస్సింగ్ మైగ్రెంట్స్ ప్రాజెక్ట్ ప్రకారం, 2025లోనే ఈ మార్గంలో 900 మందికి పైగా వలసదారులు మరణించడం లేదా గల్లంతవడం గమనార్హం.



# గోవా నుంచే హైదరాబాద్‌కు డ్రగ్స్

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు. రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.



# ఘనంగా సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలు

## కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

వేములవాడ అర్బన్, అక్టోబర్ 11 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా వేములవాడ పట్టణ బీఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటు ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో 2016 అక్టోబర్ 11న రాజన్న సిరిసిల్ల జిల్లాను ఏర్పాటు చేసిన విషయాన్ని నాయకులు గుర్తుచేశారు. జిల్లా ఆవిర్భావ దశాబ్ది సందర్భంగా అప్పటి నిర్ణయాలను, జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా ఏర్పాటుతో పాటు విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. ప్రత్యేక జిల్లా కోసం ఉద్యమించిన ఉద్యమకారులను, జిల్లా అభివృద్ధికి తోడ్పడిన నాయకులను స్మరించుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మరింత అభివృద్ధి చెందాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని వారు ఆకాంక్షించారు.

# నిరుపేద కుటుంబానికి పద్మశాలి సేవా సంస్థన్ చేయూత



వేములవాడ అర్బన్, అక్టోబర్ 11 (ఈవార్తలు): వేములవాడ పద్మశాలి సేవా సంస్థన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి ఆర్థిక, నిత్యావసర సాయం అందించారు. వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేటకు చెందిన జిందం లక్ష్మి కుటుంబానికి రూ.5,000 నగదుతో పాటు 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అవసరంలో ఉన్నవారికి తమ వంతు సహాయం అందించేందుకు సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గేంట్యాల రమేష్, వ్యవస్థాపకుడు మద్దిరాల నరేష్, యేముల శ్రీనివాస్, బిల్లా కృష్ణ, ప్రధాన కార్యదర్శి తడిగొప్పుల బాలరాజు, కోశాధికారి వేముల గంగాధర్, ప్రచార కార్యదర్శి చిలుక దేవదాస్, కార్యవర్గ సభ్యులు కొడం శ్రీనివాస్, అంజయ్య, చిలుక ప్రభాకర్, కొడం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# మల్యాల గడ్డపై దుర్గామాతల ఆగమనం

మల్యాల, అక్టోబర్ 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో నవశక్తి స్వరూపిణి దుర్గామాతలు కొలువు దీరడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవార్లకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. వారి రాకతో గ్రామంలో పండుగ వాతావరణం ఏర్పడింది. అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు ఆసక్తి చూపుతుండగా, 'జై దుర్గామాత', 'జై నవశక్తి దుర్గమ్మ' నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. అమ్మవార్ల ఆగమన సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వేషధారణలు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. దుర్గామాతల ఆశీస్సులతో గ్రామ ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు. అమ్మవార్ల రాకతో మల్యాల గ్రామంలో భక్తిభావం వెల్లివిరిసింది.

# వేములవాడలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం

వేములవాడ అర్బన్, అక్టోబర్ 11 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటల నుంచి స్వస్తి పుణ్యాహవాచనం, పంచగవ్య మిశ్రణం, ఋత్విగ్వరణం, అఖండ దీపస్థాపన, కలశ ప్రతిష్ఠ, శ్రీ గాయత్రీ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి అథర్వశీర్ష పూర్వక మహాభిషేకం, శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. తొమ్మిది మంది ఋత్విజుల ఆధ్వర్యంలో శ్రీ సూక్తం, దుర్గాసూక్తం పారాయణాలు, లలితా సహస్రనామాలతో చతుష్షష్ట్యుపచార పూజలు జరిగాయి. గాయత్రీ మూలమంత్ర జపాలు, గాయత్రీ హవనం, శ్రీమద్భాగవత పురాణ ప్రవచనం, దేవీ చండీ సప్తశతీ పారాయణం నిర్వహించారు. ఆలయంలోని పరివార దేవతలైన లక్ష్మీనారాయణ, వేంకటేశ్వర, సోమేశ్వర, మహిషాసురమర్దిని, సుబ్రహ్మణ్యేశ్వర, కాలభైరవ స్వామివార్లతో పాటు నవగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు.



సాయంత్రం 4 గంటల నుంచి భీమేశ్వర ఆలయంలో దేవీ భాగవత పురాణ ప్రవచనం నిర్వహించారు. సాయంత్రం 6.15 నుంచి రాత్రి 8 గంటల వరకు రాజరాజేశ్వరి అమ్మవారికి చతుష్షష్ట్యుపచార పూజలు, కన్యాపూజ, సువాసినీ పూజలు నిర్వహించడంతో పాటు హరిహరుల ఉత్సవమూర్తుల పల్లకీ సేవ, ఊరేగింపు చేపట్టారు. దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారి ఆలయంలోనూ దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. భక్తుల కోసం ప్రత్యేక కుంకుమ పూజలను అందుబాటులోకి తెచ్చారు. అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఈ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కుంకుమ పూజ టికెట్ ధర రూ.5,000గా నిర్ణయించారు. ఈ కార్యక్రమాలను ఆలయ డీఈఓ ప్రతాప నవీన్ కుమార్ పర్యవేక్షించారు. పూజలకు అవసరమైన ద్రవ్యాలను అర్చకులు, వేద పండితులకు అందజేశారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



# మోదీ సర్కారు భయపడుతోంది

## సీఈసీపై పోరాటాన్ని మాపై మళ్లించుకుంది: సీజేపీ

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న శాంతియుత నిరసనలను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందుకే ఈ పోరాటాన్ని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంగా మార్చుకుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్రంగా ఆరోపించింది. ముందస్తు అరెస్టు కింద అదుపులోకి తీసుకున్న తర్వాత విడుదలైన కొన్ని గంటలకే, సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రంకా ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అశుతోష్ రంకా మాట్లాడుతూ, "గత 72 గంటల్లో దేశం తీవ్రమైన అరాచక పాలనను చూసింది. నిర్దేశిత ప్రాంతంలో శాంతియుతంగా నిరసన తెలియజేయాలనుకున్న వేలాది మందిని దేశవ్యాప్తంగా అదుపులోకి తీసుకున్నారు. నిన్న మమ్మల్ని విమానం నుంచి కిడ్నాప్ చేసినంత పని చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, మేము మా తల్లిదండ్రుల నుంచి విన్న 1975 ఎమర్జెన్సీ కథలను కూడా ఈ 72 గంటల పరిణామాలు మించిపోయాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. "ఒక విషయం స్పష్టమైంది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటాన్ని ప్రధాని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా మార్చారు" అని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం, పూర్తిగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల కనుసన్నల్లోనే పనిచేస్తోందని, కేవలం బీజేపీని ఎన్నికల్లో గెలిపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కుటుంబంలో జరిగిన విషాదం పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై అశుతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అభిజీత్ నాయనమ్మ మరణవార్త తెలిసినప్పుడు కూడా ఢిల్లీ పోలీసులు అత్యంత అమానవీయంగా ప్రవర్తించారని, కెమెరాలు, మైక్రోఫోన్లతో వచ్చి ఆ విషాదాన్ని కూడా ఒక ప్రదర్శనగా మార్చడానికి ప్రయత్నించారని ఆరోపించారు. "తన తల్లిదండ్రులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వారికి సులభంగా ఆందోళన కలుగుతుందని, అందుకే తన కజిన్‌తో మాట్లాడనివ్వాలని అభిజీత్ వేడుకున్నా ఢిల్లీ పోలీసులు కనికరించలేదు" అని రంకా తెలిపారు. తాను తన నాయనమ్మ అంత్యక్రియల కోసం మహారాష్ట్రలోని సొంత ఊరికి వెళుతున్నానని, అయితే సీజేపీ వెనక్కి తగ్గదని, బెదిరింపులకు భయపడదని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు.



అభిజీత్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో తామంతా అతడికి అండగా నిలుస్తామని రంకా అన్నారు. ఈ పోరాటంలో తమకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేతలకు సీజేపీ కృతజ్ఞతలు తెలిపింది. "నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, మాణిక్ సర్కార్, పినరయి విజయన్ వీధుల్లోకి వచ్చి యువతతో కలిసి నిలబడటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి వారు చేస్తున్న పోరాటానికి నిదర్శనం. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని రంకా పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ వంటి వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులను కూడా పోలీసులు అత్యంత క్రూరంగా అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. "ఈ పోరాటం ఇప్పుడే మొదలైంది. దీనిని ఒక యుద్ధంగా మార్చినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.



## మీరు మానవత్వానికే హీరో

**భారత పైలట్‌పై ఇజ్రాయెల్ అధ్యక్షుడి ప్రశంసలు**

న్యూఢిల్లీ: విమానంలో సహ పైలట్ దాడిని ధైర్యంగా తిప్పికొట్టి 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ఇజ్రాయెల్ ప్రశంసల వర్షం కురిపించింది. ఆయన సాహసానికి గుర్తింపుగా దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఇజ్రాయెల్ ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం' అందజేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ శనివారం కెప్టెన్ స్మిత్‌కు ఒక లేఖ రాశారు. వందేళ్ల క్రితం పవిత్ర భూమిలోని నగరాల విముక్తి కోసం ప్రాణాలను పణంగా పెట్టిన భారత సైనికుల సరసన స్మిత్ నిలుస్తారని హెర్జోగ్ కొనియాడారు. "మీరు ఇకపై మా ప్రజల చరిత్రలో ఒక చిరస్మరణీయ భాగం" అని లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడిస్తూ "కెప్టెన్ స్మిత్ మచ్చర్.. మీరు ఇజ్రాయెల్, భారత్, యావత్ మానవాళికి హీరో" అని ప్రశంసించారు. కెప్టెన్ స్మిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన హెర్జోగ్.. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత జెరూసలేంకు వచ్చి తన చేతుల మీదుగా అవార్డును స్వీకరించాలని ఆహ్వానించారు. ప్రాణాపాయ స్థితిలోనూ ఆయన చూపిన ధైర్యసాహసాలు, విచక్షణ అమోఘమని కీర్తించారు. ఇటీవల దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లోని గొడ్డలితో సహ పైలట్ హమామ్ అల్-హమామి.. కెప్టెన్ స్మిత్ మాచర్‌పై దాడికి యత్నించాడు. అయితే, కెప్టెన్ స్మిత్ ధైర్యంగా ఆ దాడిని ఎదుర్కొని విమానాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చారు. ఈ ఘటనను యూఏఈ అధికారులు 'ఉగ్రవాద దాడి'గా అభివర్ణించారు.

## యెమెన్‌పై జోక్యం చేసుకుంటే ఖబడ్దార్

**పాకిస్థాన్‌కు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్**

టెహ్రాన్: సౌదీ అరేబియా, టర్కీలతో కలిసి పాకిస్థాన్ ఏర్పాటు చేసిన రక్షణ ఒప్పందం కార్యాచరణలోకి రావడంపై ఇరాన్ తీవ్ర స్వరంతో స్పందించింది. యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే ప్రాంతంపై తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయని హెచ్చరించింది. ముఖ్యంగా, అమెరికాతో చర్చల విషయంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ఈ కూటమిలో చేరడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం, సౌదీ మౌలిక సదుపాయాలపై హౌతీల క్షిపణి, డ్రోన్ దాడులు పెరగడంతో, ఈ త్రైపాక్షిక ఒప్పందం అక్టోబర్ 5 నుంచి కార్యాచరణ దశలోకి ప్రవేశించింది. సౌదీ అరేబియాకు మద్దతుగా టర్కీ, పాకిస్థాన్ చర్యలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో, వేలాది మంది పాకిస్థాన్ సైనికులను సౌదీకి పంపవచ్చనే వార్తలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి స్పందించారు. "మేము కూడా ఈ వార్తను విన్నాం. అది నిజం కాదని ఆశిస్తున్నాం. యెమెన్ విషయంలో ఏ దేశం జోక్యం చేసుకున్నా ప్రాంతంలో అవాంఛనీయ పరిణామాలు తప్పవు" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, టర్కీ కంటే పాకిస్థాన్‌పైనే ఇరాన్ తన విమర్శలను ఎక్కువగా కేంద్రీకరించింది. టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య మధ్యవర్తిగా ఇస్లామాబాద్ పోషిస్తున్న ప్రముఖ పాత్రే ఇందుకు కారణం. ఇరాన్ పార్లమెంట్ సభ్యుడు అహ్మద్ నదేరి మాట్లాడుతూ, "యెమెన్ ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో సౌదీ పక్షాన పాకిస్థాన్ చేరడం.. ఆ దేశం ఇకపై మధ్యవర్తిగా కాకుండా, ప్రాంతీయ జోక్యదారుగా మారిందని చూపిస్తోంది" అని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇరాన్‌లోని పలువురు చట్టసభ సభ్యులు ఈ ఒప్పందాన్ని ఓ కాగితపు ఒప్పందంగా కొట్టిపారేశారు. పార్లమెంట్ జాతీయ భద్రత కమిటీ సభ్యుడు ఇబ్రహీం రెజాయి సౌదీని ఉద్దేశిస్తూ ఘాటుగా విమర్శించారు. "ఏళ్ల తరబడి అమెరికాను ఏకపక్షంగా వాడుకున్నా రాని భద్రత, ఇప్పుడు టర్కీ, పాకిస్థాన్‌లతో చేసుకున్న కాగితపు ఒప్పందం వల్ల వస్తుందా? అనేది సౌదీలు తెలుసుకోవాలి. భద్రత కోసం ఇతరులను వేడుకోవాల్సిన దుస్థితి రాకుండా మీ విధానాలను సరిదిద్దుకోండి" అని ఆయన హితవు పలికారు. ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా ఈ కూటమిని తీవ్రంగా విమర్శిస్తోంది. "యెమెన్ ప్రజలకు వ్యతిరేకంగా సౌదీ యుద్ధంలో టర్కీ, పాకిస్థాన్ చేరాయి" అని తస్నిమ్ న్యూస్ పేర్కొనగా, "ఇది మక్కా కూటమా లేక యెమెన్‌లోని అణగారిన ప్రజలకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమా?" అని నూర్ న్యూస్ ప్రశ్నించింది. ఈ పరిణామం పశ్చిమాసియాలో ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచింది.

## రెండ్రోజుల్లోనే రూ. 24,000 కోట్ల వ్యాపారం

**పండగ సేల్‌కు అదిరిపోయే ఆరంభం.. ఫోన్లు, ఎలక్ట్రానిక్స్‌పై కస్టమర్ల ఆసక్తి**




న్యూఢిల్లీ: భారత్‌లో పండగ సీజన్ షాపింగ్ సందడి మొదలైంది. ప్రముఖ ఈ-కామర్స్ వేదికలు ఫెస్టివల్ సేల్స్‌కు అదిరిపోయే ఆరంభాన్ని అందుకున్నాయి. సేల్ ప్రారంభమైన తొలి రెండు రోజుల్లోనే సుమారు రూ. 24,000 కోట్ల విలువైన అమ్మకాలు జరిగినట్లు రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ నివేదిక వెల్లడించింది. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఫ్యాషన్ ఉత్పత్తుల కొనుగోళ్లకు వినియోగదారులు భారీగా ఆసక్తి చూపారు. రెడ్‌సీర్ నివేదిక ప్రకారం, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో, అజియో వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తొలి రెండ్రోజుల్లో 2.5 బిలియన్ డాలర్లకు పైగా (సుమారు రూ. 24,200 కోట్లు) స్థూల సరుకుల విలువను నమోదు చేశాయి. ఈ రెండు రోజుల్లో దేశవ్యాప్తంగా సుమారు 6 నుంచి 6.5 కోట్ల మంది వినియోగదారులు షాపింగ్ చేయగా, 8 నుంచి 9 కోట్ల ఆర్డర్లు పెట్టినట్లు అంచనా. ఈ అమ్మకాల విలువ సాధారణ రోజువారీ వ్యాపారంతో పోలిస్తే దాదాపు ఆరు రెట్లు అధికం కావడం గమనార్హం. మొత్తం అమ్మకాల్లో స్మార్ట్‌ఫోన్లదే సింహభాగం. మొత్తం జీఎంవీలో 38 నుంచి 40 శాతం వాటాతో ఇవి అగ్రస్థానంలో నిలిచాయి. వీటి విలువ సుమారు రూ. 9,100 కోట్ల నుంచి రూ. 9,600 కోట్ల వరకు ఉంటుందని అంచనా. స్మార్ట్‌ఫోన్ల తర్వాత కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రెండో అతిపెద్ద విభాగంగా నిలిచింది. మొత్తం అమ్మకాల్లో ఈ విభాగం 25-27 శాతం వాటాను (రూ. 6,000-6,500 కోట్లు) సొంతం చేసుకుంది. ముఖ్యంగా టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీల వంటి పెద్ద ఉపకరణాల అమ్మకాలు జోరుగా సాగాయి. టీవీల విభాగంలో టీసీఎల్, ఎల్జీ, శాంసంగ్, షావోమి వంటి బ్రాండ్లకు చెందిన 55-అంగుళాల మోడళ్లకు అధిక డిమాండ్ కనిపించింది.



## రాహుల్.. ఎమర్జెన్సీ ఏంటో తెలుసుకో

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు**

హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): నిజమైన ఎమర్జెన్సీ అంటే ఏమిటో, ఆ సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో రాహుల్ గాంధీ ముందుగా తెలుసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హితవు పలికారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీజేపీని ఎలా అణచివేస్తోందో స్వయంగా చూడటానికి రావాలని ఆయన రాహుల్‌ను ఆహ్వానించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను, 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీతో విపక్షాలు పోల్చడంపై కిషన్ రెడ్డి స్పందించారు. ఇవి ఎమర్జెన్సీ కాదని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కొన్ని దేశ వ్యతిరేక, అంతర్జాతీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అందుకే ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విపక్షాలు లేనిపోని సమస్యలను సృష్టించి వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యం పేరుతో కాంగ్రెస్ పార్టీ తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. "1975లో కాంగ్రెస్ వేలాది మందిని జైళ్లలో పెట్టింది, మీడియాపై నిషేధం విధించింది, పౌరుల హక్కులను కాలరాసింది" అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో తాము శాంతియుతంగా కార్యక్రమాలు చేయాలన్నా హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎలాంటి ఆంక్షలు విధిస్తోందో రాహుల్ వచ్చి చూడాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు సేవ చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటివి చేపడుతున్నామని ఆయన వివరించారు.



## చెన్నైలో మెట్రో కూత

## ప్రధాని మోదీ, సీఎం విజయ్ తొలి ప్రయాణం

చెన్నై: చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేడు కలిసి ప్రారంభించారు. పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడిపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది. ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. రోజూ ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.



## క్షయ వ్యాధిపై వ్యవసాయ కళాశాల విద్యార్థుల అవగాహన

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 11 (ఈవార్తలు): క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రామంలో వారం రోజుల పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించి, క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స ప్రాధాన్యంపై ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో చికిత్స తీసుకోవాలని తెలిపారు. జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డాక్టర్ వెంకటరామ్, డాక్టర్ శ్వేత, డాక్టర్ శేషాంక్ సూచనలు, సలహాలతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## సీఎం గారూ.. విద్యార్థుల సమస్యలు పట్టరూ!

**సిరిసిల్ల జేఎన్టీయూ విద్యార్థుల సమస్యలపై కేటీఆర్ విజ్ఞప్తి**

సిరిసిల్ల, అక్టోబర్ 11 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ పెండింగ్‌లో ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతోందని తెలిపారు. కళాశాలను ప్రస్తుత ప్రాంగణం నుంచి మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరుపయోగం కాకుండా చూడాలని సూచించారు. ఈ నేపథ్యంలో మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని, కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని కేటీఆర్ కోరారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు కళాశాల ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## సీజేపీ నిరసనలకు బంగ్లాదేశ్ ఎన్‌సీపీ మద్దతు

ఢాకా: భారత్ అంతర్గత వ్యవహారాల్లో బంగ్లాదేశ్‌కు చెందిన ఓ రాజకీయ నేత జోక్యం చేసుకోవడం వివాదాస్పదంగా మారింది. గతంలో భారత ఈశాన్య రాష్ట్రాలను ఆక్రమించుకుంటామని బెదిరింపులకు పాల్పడిన నేతలున్న నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) కన్వీనర్ నహీద్ ఇస్లాం, తాజాగా భారత్‌లోని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలోని నిరసనలకు మద్దతు ప్రకటించారు. శనివారం ఢాకా నుంచి ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్‌లో "ఎన్నికల జవాబుదారీతనం" కోరుతూ జరుగుతున్న నిరసనలకు తమ సంఘీభావం ఉంటుందని నహీద్ ఇస్లాం తన ప్రకటనలో పేర్కొన్నారు. "మైనారిటీలు భయంతో జీవిస్తున్న ఏ సమాజమూ నిజమైన ప్రజాస్వామ్యం కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై పదేపదే దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024 ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోవడానికి కారణమైన హింసాత్మక ఆందోళనల్లో నహీద్ పార్టీ నేతలు కీలక పాత్ర పోషించారు. వారి పార్టీ రాడికల్ ఇస్లామిస్ట్ సంస్థ అయిన జమాత్-ఎ-ఇస్లామీతో పొత్తు పెట్టుకుంది. 2025 డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్‌లో దీపు చంద్ర దాస్ అనే 27 ఏళ్ల హిందూ యువకుడిని మత దూషణ ఆరోపణలతో ఒక గుంపు నడిరోడ్డుపైకి లాక్కొచ్చి, చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టి చంపి, ఆ తర్వాత నిప్పంటించింది.

VANGS GLOBAL TECHNOLOGIES LLP

ePaper Pro
దసరా శుభాకాంక్షలు

DASARA SPECIAL OFFER

# Launch Your Cloud-Hosted ePaper Today

Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support

20% OFF
ON EVERY PLAN

## NEWS ONLY
website · web stories · breaking news

SAVE 20%
**Standard** 5 GB · 5 users
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

~~₹8,124~~ ₹6,499
20% OFF · SAVE ₹1,625 / YEAR

SAVE 20%
**Expanded** 10 GB · 10 users
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹12,499~~ ₹9,999
20% OFF · SAVE ₹2,500 / YEAR

SAVE 20%
**Full Press** 15 GB · 30 users
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹16,249~~ ₹12,999
20% OFF · SAVE ₹3,250 / YEAR

## ePAPER ONLY
PDF to interactive ePaper

SAVE 20%
**Standard** 5 GB · 5 users
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Unlimited pageviews & SEO
- ✓ Country & device-wise views

~~₹9,999~~ ₹7,999
20% OFF · SAVE ₹2,000 / YEAR

SAVE 20%
**Expanded** 10 GB · 10 users
- ✓ WhatsApp & email support
- ✓ Drag & drop theme builder
- ✓ Employee ID card design
- ✓ Custom domain & push alerts

~~₹14,999~~ ₹11,999
20% OFF · SAVE ₹3,000 / YEAR

SAVE 20%
**Full Press** 15 GB · 30 users
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Custom domain & push alerts

~~₹19,999~~ ₹15,999
20% OFF · SAVE ₹4,000 / YEAR

## NEWS + ePAPER
the complete digital newspaper

SAVE 20%
**Standard** 5 GB · 5 users
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

~~₹17,499~~ ₹13,999
20% OFF · SAVE ₹3,500 / YEAR

SAVE 20%
**Expanded** 10 GB · 10 users
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹22,499~~ ₹17,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

BEST VALUE
**Full Press** 15 GB · 30 users
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹32,499~~ ₹25,999
20% OFF · SAVE ₹6,500 / YEAR

## PLATFORM HIGHLIGHTS
- Smart AI image extraction
- AdSense & sponsor ad slots
- Custom domain + auto SSL
- One-click publishing
- WhatsApp sharing
- AI tagging & SEO tags
- Real-time analytics
- AWS cloud · daily backups
- YouTube video embedding

## Try free for 12 days
No credit card required · Turn your print edition into a digital publication

CALL / WHATSAPP
+91 7675087378

EMAIL
hr@vangstechnologies.com

WEBSITE
www.vangstechnologies.com

SCAN TO VISIT OUR WEBSITE

SCAN TO CALL +91 7675087378

ఈవార్తలు
వినోదవాణి CINEMA
సోమవారం 12-10-2026, జగిత్యాల | www.evarthalu.com | 6

లవ్లీ చిత్రం



# దీపావళి కానుకగా 'రామాయణం: పార్ట్ 1'

భారత సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణం: పార్ట్ 1'. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, కన్నడ రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ చిత్రం 2026 నవంబర్ 5న దీపావళి పండుగకు ముందుగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నవరాత్రుల శుభ సందర్భంగా ఈ ప్రకటన చేస్తూ, చిత్రంలోని ప్రధాన తారాగణంతో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఆదివారం నాడు చిత్ర నిర్మాణ సంస్థలు తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ విషయాన్ని వెల్లడించాయి. "ఇది రాముని యుగానికి ఆరంభం" అనే సందేశంతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్‌లో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే, రావణుడిగా యశ్ కనిపించారు. దసరా పండుగ నుంచి సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. 'దంగల్' ఫేమ్ నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ రామాయణ గాథను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, యశ్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మొదటి భాగం 2026లో రానుండగా, 'రామాయణం: పార్ట్ 2'ను 2027 దీపావళికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ చిత్రాన్ని హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు.





# రవితేజ కొత్త సినిమా 'తులాభారం'

మాస్ మహారాజా రవితేజ, విభిన్న చిత్రాల దర్శకుడు వివేక్ ఆత్రేయ కలయికలో రాబోతున్న కొత్త సినిమా టైటిల్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'తులాభారం' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఒక ప్రత్యేకమైన టైటిల్ డాక్యుమెంటరీని విడుదల చేసింది. ఈ వినూత్న ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వివేక్ ఆత్రేయ తనదైన శైలిలో కథను సిద్ధం చేయగా, రాక్‌స్టార్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. రవితేజ మార్క్ ఎనర్జీ, వివేక్ ఆత్రేయ సృష్టించే బలమైన పాత్రలు కలిసి ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా విడుదల చేసిన 'తులాభారం' టైటిల్ డాక్యుమెంటరీ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. ఇందులో చిత్ర నిర్మాణం, నేపథ్యానికి సంబంధించిన కొన్ని విశేషాలను పంచుకున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియాంక మోహన్, అనశ్వర రాజన్ కథానాయికలుగా నటిస్తుండగా, జేడీ చక్రవర్తి, తరుణ్ భాస్కర్ కీలక పాత్రలు పోషించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.

# మమితకు వరుసగా టాలీవుడ్ ఆఫర్లు

ప్రేములు-తో యువత హృదయాలను కొల్లగొట్టిన అందాల భామ మమితా బైజు సౌత్ ఇండియన్ చిత్రసీమలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోతుంది. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో, సహజమైన నటనతో అభిమానులను సంపాదిం చుకున్న యంగ్ సెన్సేషన్ టాలీవుడ్‌లో దూకుడు పెంచారు. ఇప్పటికే టాలీవుడ్‌లో విశ్వనాథ్ అండ్ సన్స్ లో నటించిన అమ్మడు తాజాగా మరో భారీ అవకాశం అందుకుందని ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం -జై హనుమాన్ లో మమితా బైజు కీలక పాత్రలో ఎంపికైందనే వార్తలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొని ఉండగా ఇందులో రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో మమిత భాగమైతే.. అమ్మడి కెరీర్‌కు ఇది బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ కావడం ఖాయం. అయితే టాలీవుడ్‌లో మమితా బైజు హడావుడి ఇక్కడితో ఆగిపోలేదు. తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ య్యేందుకు సొగసరి వరుసగా పెద్ద ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతున్నారు. కొత్త ప్రాజెక్ట్ లకు సంబంధించి జోరుగా సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.



# గాయనిగా ఊర్వశి

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనలోని మరో కొత్త ప్రతిభను బయటపెట్టారు. నటిగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, ఇప్పుడు గాయనిగా కొత్త అవతారం ఎత్తారు. 'హార్ట్ కంట్రోలర్' పేరుతో ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ (ఈడీఎం) ట్రాక్‌తో సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. విశేషమేమిటంటే, ఈ పాటకు ఆమె స్వయంగా గాత్రం అందించడమే కాకుండా, సాహిత్యం కూడా సమకూర్చారు. ఈ సందర్భంగా ఊర్వశి తన సంగీత ప్రయాణం గురించి మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ అంటే నాకు ఎప్పటినుంచో ఆసక్తి ఉంది. ఒక నటిగా నా ఇమేజ్‌కు అదనంగా కాకుండా, ఈ సంగీతంలోనే ఒక గాయనిగా, రచయిత్రిగా నన్ను నేను చూసుకోవాలనుకున్నాను. బాలీవుడ్ చరిత్రలోనే పూర్తి స్థాయి ఈడీఎం పాటను ఆలపించిన తొలి ప్రధాన గాయనిని నేనే కావడం గర్వంగా ఉంది" అని ఆమె తెలిపారు. ఈ పాట టైటిల్ వెనుక ఉన్న అర్థాన్ని కూడా ఊర్వశి వివరించారు. "'హార్ట్ కంట్రోలర్' అనే పదం నా పేరు 'ఊర్వశి' నుంచే వచ్చింది. ఇందులో 'ఉర్' అంటే హృదయం, 'వశి' అంటే నియంత్రించేది. అందుకే ఈ పేరు పెట్టాను. ఈ పాటలో నేను మరో మహిళ గురించి పాడటం లేదు, నా గురించే పాడుకుంటున్నాను" అని ఆమె స్పష్టం చేశారు. ఈ పాట కేవలం సంగీతం మాత్రమే కాదని, ఇందులో మహాభారత ప్రస్తావన, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కూడా మిళితమై ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. తన ఇంటిపేరైన 'రౌతేలా'ను కూడా ఉద్దేశపూర్వకంగానే సాహిత్యంలో చేర్చినట్లు చెప్పారు. హాలీవుడ్ మ్యూజిక్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ నిర్మాతలు అస్లాన్, తైమూర్ జానా, ఓరియంటల్ హౌస్‌తో కలిసి ఈ పాటను రూపొందించినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే పాట విన్నవారు మంచి స్పందన ఇస్తున్నారని, ఇకపై ఈ పాట తనది మాత్రమే కాదని, శ్రోతలందరిదీ అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.



# బిజినెస్ వరల్డ్‌లోకి జాన్వీ కపూర్



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఇటీవల సోషల్ మీడియాలో మేకప్ ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ తరచుగా కనిపిస్తున్నారు. దీంతో హాలీవుడ్ పాప్ ఐకాన్ కైలీ జెన్నర్ బాటలోనే జాన్వీ కూడా త్వరలోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్యూటీ లేదా కాస్మోటిక్స్ బ్రాండ్‌ను మార్కెట్లోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. కేవలం నటనకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోనూ తన ముద్ర వేయాలని, ఒక సక్సెస్ ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ గా రాణించాలని జాన్వీ కలలు కంటున్నారు. సినిమా రంగంలో అగ్ర కథానాయికలుగా వెలుగొందుతున్న పలువురు నటీమణులు ఇప్పటికే వ్యాపార వేత్తలుగా మారి విజయం సాధించారు. ఈ నేపథ్యంలో జాన్వీ కూడా బిజినెస్ వరల్డ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు.



# గుండెపోటుతోనే నానాపటేకర్ మృతి

ప్రముఖ నటుడు నానా పటేకర్ మృతికి సంబంధించిన సస్పెన్స్ వీడిపోయింది. ఆయన మరణం సహజమైనదేనని, తీవ్రమైన గుండెపోటు కారణంగానే ప్రాణాలు కోల్పోయారని పోస్ట్‌మార్టం నివేదికలో వెల్లడైంది. గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వైద్యుల బృందం ఈ నివేదికను గోవా పోలీసులకు అందజేసింది. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గుండెకు రక్తాన్ని సరఫరాచేసే ప్రధాన ధమనిలో రక్తం గడ్డకట్టడంతో గుండెపోటు సంభవించి నానా పటేకర్ మరణించారు. పోస్ట్‌మార్టం నివేదిక వివరాలను కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు కూడా అంగీకరించారని, ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని పోలీసులు పేర్కొన్నారు. అక్టోబర్ 8వ తేదీ తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో నానా పటేకర్ తన కుటుంబ స్నేహితుడికి వాట్సాప్ ద్వారా అనారోగ్యంగా ఉన్నట్లు సందేశం పంపారు. వెంటనే దోనా పౌలాలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సుమారు 45 నిమిషాలపాటు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆయన అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. ఈ ఘటనపై పనాజీ పోలీసులు మొదట దీఎూ సెక్షన్ 194 కింద అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. తాజా పోస్ట్‌మార్టం నివేదికతో ఆయన మరణం గుండెపోటు కారణంగా జరిగిందని తేలింది. దాంతో పటేకర్ కుమారుడు మల్హార్ పటేకర్, మేనల్లుడు ప్రసాద్ పటేకర్‌పై ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టమైంది.

# దైవ సంకల్పం ఉంటేనే రామ దర్శనం

యూపీలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అయోధ్య రామమందిరాన్ని సినీ నటి, బీజేపీ ఎంపీ కంగనారనౌత్ సందర్శించింది. ఈ సందర్భంగా సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించింది.. అనంతరం ఆలయ పండితులు కంగనారనౌత్‌కు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా కంగనా రనౌత్ మీడియాతో మాట్లాడుతూ.. అయోధ్యలోని పవిత్రమైన రామజన్మభూమిని సందర్శించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. దైవ సంకల్పం ఉంటేనే ఇక్కడికి రావడం సాధ్యమవుతుంది. ఈ రోజు ఇక్కడ పూజలు నిర్వహించడం, అత్యంత పవిత్రమైన క్షేత్రాన్ని దర్శించుకోవడం నిజంగా గొప్ప వరం. అయోధ్య రామ మందిరంలో గడిపిన సమయం ఎంతో అద్భుతంగా అనిపించింది. ఆలయ ప్రాంగణం ఎంత అందంగా, విశాలంగా ఉందంటే కుటుంబంతో కలిసి కనీసం ఒక్క రోజంతా ఇక్కడ గడిపితేనే మనసు పూర్తిగా తృప్తి చెందుతుందనిపిస్తుందని చెప్పుకొచ్చింది.






మూడో టీ20లో టీమిండియా గెలుపు

# భారత్ థ్రిల్లింగ్ విక్టరీ





### సిరీస్‌లో 2-1 ఆధిక్యం

ఇండోర్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటర్లు, ఆ తర్వాత బౌలర్లు సమష్టిగా రాణించడంతో భారత్ గెలుపొందింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగుల భారీ స్కోరు సాధించి ఆలౌటైంది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (30 బంతుల్లో 69; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతనికి ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 37) తోడవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఆ తర్వాత తిలక్ వర్మ (28), నితీశ్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20) కూడా కీలక పరుగులు జోడించడంతో భారత్ భారీ స్కోరు చేయగలిగింది. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, షమార్ స్ప్రింగర్, షమార్ జోసెఫ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. 224 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో వెస్టిండీస్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ షాయ్ హోప్ (5)ను అర్ష్‌దీప్ సింగ్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేర్చాడు. అయితే, షిమ్రాన్ హెట్మెయర్ (43), కమిల్ పూరన్ (42) దూకుడుగా ఆడి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో విండీస్ లక్ష్యానికి దూరమైంది. చివర్లో షమార్ స్ప్రింగర్ (11 బంతుల్లో 35 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లతో సత్తా చాటగా, నమన్ ధీర్ 2 వికెట్లు తీశాడు. ఈ సిరీస్‌లో ఒక జట్టు లక్ష్యాన్ని కాపాడుకోవడం ఇదే తొలిసారి. మ్యాచ్‌కు మంచు ప్రభావం పెద్దగా లేకపోవడం భారత బౌలర్లకు కలిసొచ్చింది. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరగనుంది.

## యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా స్మృతి



భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్యసమితికి చెందిన యునిసెఫ్ ఇండియా ఆమెను తమ 'సెలబ్రిటీ అడ్వకేట్'గా నియమించింది. ఈ కొత్త బాధ్యతలో భాగంగా బాలికల హక్కులు, భద్రత, వారి సామర్థ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు క్రీడల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించేందుకు స్మృతి కృషి చేస్తుంది. బాలికల ఆరోగ్యం, శ్రేయస్సు, సాధికారత కోసం యునిసెఫ్ ఇండియా చేపట్టే కార్యక్రమాలకు మంధాన మద్దతుగా నిలవనుంది. ఈ నియామకంపై స్మృతి మంధాన హర్షం వ్యక్తం చేసింది. "యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. క్రికెట్ ఆడుతూ పెరిగిన నాకు, ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని తెలిసింది. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహం ఉంటే ఆ అవకాశాన్ని అద్భుతంగా మార్చుకోవచ్చు. ప్రతి చిన్నారి, యువత పెద్ద కలలు కని, వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే అవకాశం పొందాలి" అని ఆమె పేర్కొంది. గతంలో కూడా స్మృతి లింగ సమానత్వంపై యునిసెఫ్-ఐసీసీ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంది. యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రే మాట్లాడుతూ.. స్మృతి నియామకంపై ఆనందం వ్యక్తం చేశారు. "ఒక యువ అథ్లెట్‌గా ప్రయాణం మొదలుపెట్టి, ప్రపంచ స్థాయి క్రికెట్ ఐకాన్‌గా ఎదిగిన స్మృతి ప్రస్థానం.. ప్రతిభకు అవకాశం తోడైతే ఏం సాధించవచ్చో బాలికలకు నిరూపిస్తుంది.

## చెలరేగిన షమీ



ప్రముఖ దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి రోజు ఆటలోనే పలువురు సీనియర్, యువ ఆటగాళ్లు తమ సత్తా చాటారు. ముఖ్యంగా టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న స్టార్ పేసర్ మహమ్మద్ షమీ, బంతితో అద్భుతం చేశాడు. కల్యాణి వేదికగా ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో బెంగాల్ తరఫున ఆడిన 36 ఏళ్ల షమీ, తన పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని వణికించాడు. 17.3 ఓవర్లలో కేవలం 30 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి, తనలో పదును ఇంకా తగ్గలేదంటూ సెలక్టర్లకు స్పష్టమైన సందేశం పంపాడు. అతని ధాటికి ఢిల్లీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 240 పరుగులకే ఆలౌట్ అయింది. మరోవైపు, విజయవాడ వేదికగా ఆంధ్ర, కర్ణాటక మధ్య జరుగుతున్న మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక జట్టు 22 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ రవిచంద్రన్ స్మరణ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. 218 బంతుల్లో 126 పరుగులు చేసి కెప్టెన్సీ అరంగేట్రంలోనే శతకంతో మెరిశాడు. అతనికి వికెట్ కీపర్ కృష్ణన్ శ్రీజిత్ (58) చక్కటి సహకారం అందించడంతో కర్ణాటక 274 పరుగులు చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర, తొలిరోజు ఆట ముగిసేసరికి 2 వికెట్ల నష్టానికి 16 పరుగులు చేసింది.

## భారత్‌తో వన్డే సిరీస్‌కు కివీస్ జట్టు ప్రకటన




భారత్‌తో త్వరలో జరగనున్న 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జడ్‌సీ) తమ జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌కు వైట్-బాల్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ నాయకత్వం వహించనున్నాడు. స్టార్ పేసర్ లాకీ ఫెర్గూసన్, ఫిన్ అలెన్, టిమ్ సైఫర్ట్ చాలాకాలం తర్వాత తిరిగి వన్డే జట్టులోకి రావడం విశేషం. గాయం కారణంగా గత టీ20 సిరీస్‌కు దూరమైన యువ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర కోలుకుని, తొలి మూడు మ్యాచ్‌లకు అందుబాటులోకి వచ్చాడు. నవంబర్ 4న ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జనవరిలో భారత్ గడ్డపై చారిత్రక వన్డే సిరీస్ (2-1) గెలిచిన కివీస్, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది. అయితే, ఈ సిరీస్ తర్వాత భారత్‌తోనే టెస్ట్ సిరీస్ ఉన్న నేపథ్యంలో, ఆటగాళ్లపై భారం తగ్గించేందుకు కివీస్ బోర్డు ఓ ప్రయోగాత్మక నిర్ణయం తీసుకుంది. సిరీస్‌లోని తొలి మూడు వన్డేలకు ఒక జట్టును, చివరి రెండు వన్డేలకు మరో జట్టును ఎంపిక చేసింది. తొలి మూడు మ్యాచ్‌ల తర్వాత కొంతమంది ఆటగాళ్లు టెస్ట్ సిరీస్ సన్నాహకాల కోసం వెల్లింగ్‌టన్‌కు వెళ్తారని, వారి స్థానంలో మరో ఏడుగురు ఆటగాళ్లు జట్టుతో చేరతారని హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. "భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం మాకు పెద్ద సవాల్. ఏడాది దూరంలో ఉన్న వన్డే ప్రపంచకప్‌కు ఈ సిరీస్ సన్నాహకంగా ఉపయోగపడుతుంది. ఫెర్గూసన్, అలెన్ వంటి మ్యాచ్ విన్నర్లు తిరిగి రావడం జట్టుకు బలం చేకూరుస్తుంది" అని అన్నాడు.




భారత్‌తో సిరీస్‌కు కివీస్ ప్రత్యేక జెర్సీ

భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కివీస్ జట్టు ఒక ప్రత్యేకమైన జెర్సీతో మైదానంలోకి దిగనుంది. త్వరలో భారత్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ ఆటగాళ్లు ఈ పరిమిత ఎడిషన్ జెర్సీని ధరించనున్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక బంధం, సాంస్కృతిక సంబంధం, పరస్పర గౌరవాన్ని చాటిచెప్పేలా ఈ జెర్సీని రూపొందించారు. దీనికి 'కోటహితాంగ వన్డే షర్ట్' అని పేరు పెట్టారు. అక్టోబర్ 22 నుంచి ఈ సిరీస్ ప్రారంభం అవుతుంది. ఈ జెర్సీ డిజైన్‌ను మయోరీ కళాకారుడు బెన్ థామసన్, భారత సంతతికి చెందిన కళాకారులు శివ్ నారందాస్, జై పంఛా కలిసి రూపొందించారు. మయోరీ, భారతీయ కళా సంప్రదాయాలను అద్భుతంగా మేళవించి, ఇరు దేశాల చారిత్రక బంధాన్ని ప్రతిబింబించేలా దీనిని తీర్చిదిద్దారు. మయోరీ సంస్కృతికి చెందిన 'కోవైవై' నమూనాలతో పాటు, భారత జాతీయ పుష్పమైన కమలం, భారతీయ వాస్తుశిల్పంలోని 'ఓగీ' నమూనా, 'మండల' ఆర్ట్‌ను ఈ జెర్సీలో పొందుపరిచారు. ఈ సందర్భంగా న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జడ్‌సీ) చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గ్లెన్ క్రిచ్లీ మాట్లాడుతూ.. ఈ డిజైన్ తమను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. "వేర్వేరు సంస్కృతులను క్రీడలు ఏకం చేస్తాయని చెప్పడానికి ఇది ఒక నిదర్శనం. ఈ జెర్సీ భారత్, న్యూజిలాండ్ అభిమానులకు ఒక అపురూప జ్ఞాపకంగా నిలిచిపోతుందని ఆశిస్తున్నాం" అని ఆయన అన్నారు. ఐక్యత (కోటహితాంగ) అనేదే ఈ డిజైన్‌కు మార్గనిర్దేశం చేసిందని కళాకారుడు బెన్ థామసన్ వివరించారు. అభిమానులు ఈ జెర్సీని గర్వంగా ధరిస్తారని ఆశిస్తున్నానని మరో కళాకారుడు శివ్ నారందాస్ పేర్కొన్నారు.



## నలుగురు 600 వికెట్లు తీశారు!

ఆస్ట్రేలియా ప్రఖ్యాత బౌలింగ్ చతుష్టయం టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. పేసర్లు పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, స్పిన్నర్ నాథన్ లైయన్‌లతో కూడిన ఈ బృందం.. కలిసి ఆడిన టెస్టుల్లో 600 వికెట్లు పడగొట్టిన తొలి బౌలింగ్ బృందంగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. దక్షిణాఫ్రికాతో డర్బన్‌లోని కింగ్స్‌మీడ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకుంది. ఈ టెస్టు ప్రారంభానికి ముందు ఈ నలుగురు బౌలర్లు కలిసి 37 టెస్టుల్లో 599 వికెట్లు తీశారు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లు పడగొట్టడం ద్వారా తమ 38వ టెస్టులో 600 వికెట్ల మైలురాయిని దాటారు. ఈ 38 మ్యాచుల్లో కమ్మిన్స్ అత్యధికంగా 160 వికెట్లు పడగొట్టగా, స్టార్క్ 155, హాజిల్‌వుడ్ 152, లైయన్ 140 వికెట్లతో తమ వంతు పాత్ర పోషించారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే బృందంగా ఆడుతూ 600 వికెట్ల మైలురాయిని దాటిన తొలి బౌలింగ్ చతుష్టయం ఇదే కావడం విశేషం. వీరి తర్వాత రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్, బెన్ స్టోక్స్, మొయిన్ అలీల చతుష్టయం 34 టెస్టుల్లో కలిసి 433 వికెట్లు మాత్రమే తీసింది. దీన్నిబట్టి ఆసీస్ బౌలర్ల ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు మాట్ రెన్షా సెంచరీతో 390 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను ఈ నలుగురు బౌలర్లు కట్టడి చేశారు. కమ్మిన్స్ మూడు వికెట్లు తీయగా, హేజిల్‌వుడ్, లైయన్ చెరో రెండు వికెట్లు, స్టార్క్ ఒక వికెట్ పడగొట్టారు. దీంతో దక్షిణాఫ్రికా 197 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.



## వైభవ్ నాలాగే ఉన్నాడు: సెహ్వాగ్

టీమిండియా యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేందర్ సెహ్వాగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. తొలి బంతి నుంచే దూకుడుగా ఆడాలనే ఆలోచనా విధానం అచ్చం తనలాగే ఉందని, 15 ఏళ్ల వైభవ్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యుత్తమ ఫామ్‌లో (ప్రైమ్‌లో) ఉన్నాడని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. శనివారం ఢిల్లీలో జరిగిన పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వార్షిక సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "సూర్యవంశీ ఇప్పుడు ప్రైమ్‌లో ఉన్నాడు. మొదటి బంతి నుంచే బాదాలనే ఆలోచన నాలాగే ఉంది. అతడికి ఎప్పుడు అవకాశం వస్తుంది, భారత్ తరఫున ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడన్నదే ఇప్పుడు ముఖ్యం" అని సెహ్వాగ్ పేర్కొన్నాడు. జట్టు ఎంపికలో వయసు కంటే ప్రదర్శనకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశాడు. "అండర్-19 వంటి విభాగాల్లో వయసు చూడాలి. కానీ ఐపీఎల్ లేదా టీమ్ ఇండియాలోకి వచ్చాక ప్రదర్శనే ప్రధానం. 38 ఏళ్ల విరాట్ కోహ్లీ ఆడుతున్నప్పుడు, 15 ఏళ్ల వైభవ్ కూడా ఆడగలడు" అని సెహ్వాగ్ వివరించారు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ఓట్ చోరీ కాదు.. ఓట్ల ప్రక్షాళన!

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. పాలకులను ఎన్నుకునే శక్తి. ప్రభుత్వాల భవిష్యత్తును నిర్ణయించే హక్కు. అలాంటి ఓటు విలువను కాపాడటం ఎంత ముఖ్యమో.. ఓటరు జాబితాను స్వచ్ఛంగా ఉంచడం కూడా అంతే ముఖ్యం. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండాలి. అదే సమయంలో అనర్హులు, నకిలీ ఓట్లు, ఒకే వ్యక్తి పేరుతో నమోదైన బహుళ చెల్లని నమోదులు ఎన్నికల ప్రక్రియను కలుషితం చేయకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే ఎన్నికల సంఘం ముందున్న అసలు బాధ్యత. అయితే ఓటరు జాబితాల సవరణకు చేపట్టే చర్యలపై రాజకీయ దుమారం రేగిన ప్రతిసారీ ఒక మౌలిక ప్రశ్న తెరపైకి వస్తోంది. ఓట్లను ప్రక్షాళన చేయడం ఓట్ చోరీ అవుతుందా? లేక ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులను తొలగిస్తేనే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదమా? ఎన్నికల సమయంలో ఓటరు జాబితాలపై రాజకీయ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడం కొత్తేమీ కాదు. తమకు అనుకూలంగా లేని ఓటర్లను తొలగిస్తున్నారని ఒకరు ఆరోపిస్తే.. దొంగ ఓట్లను తొలగించకుండా అడ్డుకుంటున్నారని మరొకరు విమర్శిస్తారు. ఓట్ల తొలగింపును ఓట్ చోరీగా అభివర్ణిస్తారు. ఇంకొందరు దాన్ని ఓట్ల ప్రక్షాళనగా సమర్థిస్తారు. కానీ ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఇలాంటి కీలక అంశాలను రాజకీయ నినాదాలతో మాత్రమే నిర్ణయించలేం. వాస్తవాలు, ఆధారాలు, చట్టబద్ధమైన విధానాలే ప్రామాణికం కావాలి. ఒక వ్యక్తి మరణించినా ఓటరు జాబితాలో పేరు కొనసాగడం, శాశ్వతంగా వేరే ప్రాంతానికి వెళ్లిపోయిన వారి నమోదులు సకాలంలో సవరించకపోవడం, ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదవడం, అర్హతలేని వ్యక్తుల పేర్లు జాబితాలో చేరడం వంటి సమస్యలు ఎన్నికల నిర్వహణలో సవాళ్లుగా మారవచ్చు. ఇలాంటి లోపాలను గుర్తించి సరిచేయడం ఎన్నికల సంఘం విధుల్లో భాగం. ఓటరు జాబితా ఎంత స్వచ్ఛంగా ఉంటే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అంత విశ్వాసం పెరుగుతుంది. ఒక నియోజకవర్గంలో నిజంగా నివసించే అర్హుడైన ఓటరుకు ఓటు హక్కు కల్పించడం ఎంత అవసరమో, అదే ఓటు హక్కును దుర్వినియోగం చేసే అవకాశాలను అడ్డుకోవడం కూడా అంతే అవసరం. దొంగ ఓట్లు, నకిలీ నమోదులు కొనసాగితే నిజమైన ఓటరు తీర్పుపై ప్రభావం పడే ప్రమాదం ఉంటుంది. అందుకే ఓటరు జాబితాల పరిశీలన, సవరణలను కేవలం రాజకీయ కోణంలో చూడకూడదు. ఓటు హక్కు పవిత్రతను కాపాడే ప్రక్రియగా చూడాలి. అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. ఒకే వ్యక్తి పేరు వేర్వేరు ప్రాంతాల్లో నమోదై ఉండటం మాత్రమే అతను రెండుసార్లు ఓటు వేశాడని నిరూపించదు. ఒక వ్యక్తికి చట్టప్రకారం ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదు ఉండకూడదు. కానీ అలాంటి నమోదులను తొలగించేటప్పుడు సరైన విచారణ, గుర్తింపు, నోటీసు, అభ్యంతరాల పరిశీలన వంటి చట్టబద్ధమైన ప్రక్రియలు అనుసరించాలి. పేరులో అక్షరదోషం ఉందని, చిరునామా మారిందని, ఒకే పేరుతో మరో వ్యక్తి ఉన్నాడని మాత్రమే ఓటును తొలగిస్తే అది తీవ్రమైన అన్యాయం అవుతుంది. ఎన్నికల సంఘానికి ఓటరు జాబితాలను సిద్ధం చేయడం, సవరించడం, ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించడం వంటి చట్టబద్ధమైన అధికారాలు ఉన్నాయి. ఆ అధికారాలు ఉన్నాయని చెప్పి ఏ నిర్ణయం తీసుకున్నా ప్రశ్నించకూడదని అనడం సరికాదు. అధికారానికి బాధ్యత తోడవాలి. ప్రజాస్వామ్యంలో ఏ సంస్థా విమర్శలకు అతీతం కాదు. ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలు కూడా చట్టం, పారదర్శకత, నిష్పాక్షికత అనే ప్రమాణాలకు లోబడి ఉండాలి.

# మత్తులో.. మంచం పట్టి..!

పిల్లలు ప్రయోజకులై కుటుంబానికి అండగా నిలవాలని తల్లిదండ్రులు కలలు కంటారు. రెక్కలు ముక్కలు చేసుకొని చదివిస్తారు. తమకు దక్కని అవకాశాలు బిడ్డలకైనా దక్కాలని ఆశపడతారు. కానీ ఆ ఆశల మధ్యలో మత్తు చొరబడితే? చదువుపై ఆసక్తి తగ్గి, సంపాదన కంటే ఖర్చులు పెరిగి, ఇంట్లో మాటామాటా ఘర్షణగా మారితే? బిడ్డ ఎక్కడ తిరుగుతున్నాడో, ఎవరితో ఉంటున్నాడో తెలియక తల్లిదండ్రులు ఆందోళనతో ఎదురుచూడాల్సి వస్తే? ఇవి ప్రతి కుటుంబంలో జరుగుతున్నాయని చెప్పలేం. కానీ మత్తు పదార్థాల ముప్పును ముందుగానే గుర్తించాల్సిన అవసరాన్ని ఈ ప్రశ్నలు గుర్తుచేస్తున్నాయి. స్నేహితుల సరదాగా మొదలయ్యే ప్రయోగం కొందరిలో అలవాటుగా, ఆ తర్వాత వ్యసనంగా మారవచ్చు. దాని ప్రభావం ఆరోగ్యానికే పరిమితం కాకుండా చదువు, ఉపాధి, ఆర్థిక పరిస్థితి, కుటుంబ సంబంధాలపైనా పడవచ్చు. ముఖ్యంగా యువత జీవితాన్ని లక్ష్యంగా చేసుకునే అక్రమ మత్తు పదార్థాల సరఫరాను తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. మత్తు బారిన పడిన వ్యక్తిని అవమానించడం పరిష్కారం కాదు; అతడిని ఆ స్థితికి నడిపించిన పరిస్థితులను గుర్తించి, సరఫరాను అడ్డుకొని, అవసరమైన చికిత్స అందించడమే సమర్థమైన మార్గం.



**శ్రీశైలం దూడం**
**ఫ్రీలాన్స్ జర్నలిస్టు, 9133947176.**

తెలంగాణను మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పిలుపు ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. 2026 మార్చి 11న రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన తన పర్యటనల్లో పలుచోట్ల మత్తు నిర్మూలన ఆవశ్యకతను ప్రస్తావించారు. అక్టోబరు 6న మెదక్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద నషా ముక్త్ భారత్ అవగాహన ర్యాలీని ప్రారంభించి, "జీవితానికి అవును.. మాదకద్రవ్యాలకు కాదు" అనే సందేశాన్ని ఇచ్చారు. 2029 కంటే ముందే తెలంగాణను మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఆగస్టు 25న నిజామాబాద్‌లోని భూమారెడ్డి సమావేశ మందిరంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో యువతే మత్తు రహిత సమాజ నిర్మాణానికి నాయకత్వం వహించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ మత్తు పదార్థాల నియంత్రణ విభాగం 'ఈగల్' కృషిని, విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన 'ప్రహరీ' అవగాహన బృందాలను అభినందించారు. జూలైలో హనుమకొండలో కలెక్టరేట్ నుంచి కళాశాల వరకు నిర్వహించిన ర్యాలీలో మత్తుపై పోరాటం ఇంటి నుంచే మొదలవ్వాలని పిలుపునిచ్చారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో 'నివృత్తి' వ్యసన విముక్తి కేంద్రాన్ని ప్రారంభించడం కూడా ఈ ప్రయత్నాల్లో భాగం. ఈ కార్యక్రమాలు మత్తు సమస్యపై అవగాహన పెంచే ప్రయత్నాలుగా నిలుస్తున్నాయి. అయితే వాటి ప్రభావం ఎంతవరకు ప్రజలకు చేరిందో అంచనా వేయడానికి నిరంతర సమీక్ష, స్పష్టమైన ఫలితాలు అవసరం.

మత్తు పదార్థాల సమస్యను పట్టణాలకే పరిమితమైనదిగా చూడటం పొరపాటు. అదే సమయంలో ఆధారాలు లేకుండా ప్రతి పల్లెలోనూ మాదకద్రవ్యాల ముఠాలు విస్తరించాయని ప్రకటించడం కూడా సరికాదు. ఏ ప్రాంతంలో ఎలాంటి సమస్య ఉందో స్థానిక సమాచారం, దర్యాప్తు, వైద్య విభాగాల వివరాలు, అందుబాటులో ఉన్న అధ్యయనాల ఆధారంగా గుర్తించాలి. మద్యం వినియోగం, గంజాయి, ఇతర నిషేధిత మాదకద్రవ్యాల వినియోగాన్ని ఒకే అంశంగా కలిపి చూడకూడదు. వాటి చట్టపరమైన స్థితి, ప్రభావాలు, నియంత్రణ పద్ధతులు వేర్వేరుగా ఉంటాయి. నిషేధిత పదార్థాల అక్రమ విక్రయాలు, రవాణా, సరఫరా వెనుక ఉన్న గొలుసును ఛేదించడం పోలీసు, సంబంధిత దర్యాప్తు సంస్థల బాధ్యత. మద్యం విక్రయాల నియంత్రణ, సంబంధిత చట్టాల అమలులో ఎక్సైజ్ శాఖకు కీలక పాత్ర ఉంది. ఆరోగ్య శాఖ చికిత్స, వ్యసన విముక్తి సేవలను బలోపేతం చేయాలి. విద్యాశాఖ పాఠశాలల్లో ముందస్తు అవగాహన కల్పించాలి. స్థానిక పరిపాలన ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. ఒక శాఖ తన పని చేసిందని మిగతావారు బాధ్యత నుంచి తప్పించుకోలేరు. మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? యువతకు ఎలా చేరుతున్నాయి? అక్రమ లావాదేవీల వెనుక ఎవరున్నారు? సరఫరా మార్గాలు ఏమిటి? అనే ప్రశ్నలకు ఆధారాలతో సమాధానాలు వెతకాలి. అదే సమయంలో అనుమానం ఒక్కటే నేరానికి సాక్ష్యం కాదన్న విషయాన్ని గుర్తుంచుకొని చట్టబద్ధమైన దర్యాప్తు జరగాలి.

పాఠశాలల వద్దే నివారణ మొదలవ్వాలి. కేంద్ర ప్రభుత్వ కార్యాచరణలో విద్యాసంస్థల పరిసరాలను మత్తు పదార్థాల రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడం, బాధ్యతగల ఉపాధ్యాయులను నియమించడం, విద్యార్థులకు అవగాహన కల్పించడం, అవసరమైనప్పుడు మానసిక సలహా సేవలతో అనుసంధానం చేయడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇచ్చారు. పాఠశాలల చుట్టూ 500 మీటర్ల పరిధిని మాదకద్రవ్యాల రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దే ప్రతిపాదననూ ప్రస్తావించారు. ఈ మార్గదర్శకాలను తెలంగాణలో ఎంత సమర్థంగా అమలు చేస్తున్నారన్నది ప్రభుత్వం వెల్లడించాలి. ప్రతి పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించి చిత్రాలు తీసుకోవడం మాత్రమే సరిపోదు. విద్యార్థులకు నిజంగా సమాచారం చేరిందా? ఒత్తిడిలో ఉన్నవారికి సహాయం అందుతోందా? పాఠశాల పరిసరాల్లో అక్రమ విక్రయాలపై ఫిర్యాదు వస్తే అధికారులు ఎంత వేగంగా స్పందిస్తున్నారు? అనే అంశాలపై సమీక్ష ఉండాలి. పిల్లల్లో ఆకస్మిక ప్రవర్తనా మార్పులు కనిపించినప్పుడు వారిని అవమానించడం, అందరి ముందు నిందించడం వల్ల సమస్య మరింత క్లిష్టమవచ్చు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా మాట్లాడి కారణం తెలుసుకోవాలి. అవసరమైతే వైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం పొందేలా చూడాలి. యువతకు మత్తు వల్ల కలిగే ప్రమాదాలను భయపెట్టే మాటలతో కాకుండా శాస్త్రీయంగా వివరించాలి.

మత్తు బారిన పడినవారిని తిరిగి జీవితంలో నిలబెట్టే వ్యవస్థ కూడా అంతే ముఖ్యం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2026-2029 కార్యాచరణ పత్రంలో దేశవ్యాప్తంగా వ్యసన విముక్తి కేంద్రాల సంఖ్యను 334



నుంచి 2029 మార్చి నాటికి 1,751కు పెంచాలనే లక్ష్యాన్ని పేర్కొన్నట్లు సమాచారం. ఇవి దేశస్థాయి లక్ష్యాలు. తెలంగాణలో వాటి అమలు స్థితి, రాష్ట్రానికి అందుబాటులో ఉన్న కేంద్రాలు, వైద్య నిపుణులు, పడకలు, చికిత్సా సేవల వివరాలు విడిగా వెల్లడించాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి చికిత్స కోసం పట్టణాలకు వెళ్లాల్సి వస్తే ప్రయాణ ఖర్చులు, కుటుంబ పరిస్థితులు అడ్డంకిగా మారవచ్చు. అందువల్ల జిల్లాస్థాయిలో సేవలు అందుబాటులో ఉండేలా చూడాలి. చికిత్స కోరేవారి వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉండాలి. వ్యసనం నుంచి బయటపడాలనుకునే వ్యక్తిని సమాజం చిన్నచూపు చూడకుండా, తిరిగి చదువు లేదా ఉపాధిలోకి చేరే అవకాశాలు కల్పించాలి. చికిత్స ముగిసిందంటే సమస్య పూర్తిగా పరిష్కారమైనట్లు కాదు. కుటుంబ మద్దతు, నిరంతర సలహాలు, ఉపాధి అవకాశాలు, అవసరమైన వైద్య పర్యవేక్షణ అందాలి. అక్రమ సరఫరాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి; వ్యసనంతో బాధపడుతున్న వ్యక్తికి మాత్రం అవసరమైన చికిత్స అందే మార్గం మూసుకుపోకూడదు.

మద్యం విధానాన్ని కూడా ప్రజారోగ్యం కోణంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం రావచ్చు. కానీ ఆ ఆదాయాన్ని మాత్రమే చూపించి విధానం విజయవంతమైందని నిర్ణయించలేం. అధిక మద్యపానం ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, పని సామర్థ్యం, ప్రమాదాల ముప్పు వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం చూపగలదు. అయితే ప్రతి ప్రమాదానికీ, ప్రతి కుటుంబ సమస్యకీ మద్యమే కారణమని ఆధారాలు లేకుండా తేల్చడం కూడా సమంజసం కాదు. ప్రభుత్వం మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని వెల్లడించడంతోపాటు, వ్యసన నివారణ, ప్రజారోగ్య సేవలు, చికిత్సా కేంద్రాల కోసం చేస్తున్న ఖర్చుల వివరాలను కూడా ప్రజలకు అందించాలి. మద్యం వినియోగంతో ముడిపడిన సామాజిక, ఆరోగ్య వ్యయాలను అంచనా వేసేందుకు స్వతంత్ర అధ్యయనం నిర్వహించాలి. అప్పుడు ఆదాయం ఎంత? దుష్ప్రభావాలను తగ్గించేందుకు ఎంత ఖర్చవుతోంది? నివారణ కార్యక్రమాలు ఎంతవరకు ఫలిస్తున్నాయి? వంటి ప్రశ్నలకు ఆధారాలతో సమాధానాలు లభిస్తాయి. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం అంటే ముందే తప్పు పట్టడం కాదు; ప్రజలకు సంబంధించిన విధానాల్లో పారదర్శకత కోరడం. మత్తు సమస్యను ఆదాయపు లెక్కలతోనో, నినాదాలతోనో కొలవకుండా, ప్రజల ఆరోగ్యం, కుటుంబాల సంక్షేమం, యువత భవిష్యత్తు అనే ప్రమాణాలతో అంచనా వేయాలి.

గ్రామస్థాయిలో కార్యాచరణకు స్పష్టమైన రూపం ఇవ్వాలి. గ్రామపంచాయతీలు, పాఠశాలలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ఆరోగ్య సిబ్బంది, పోలీసులు సమన్వయంతో పనిచేయాలి. అక్రమ విక్రయాలపై సమాచారం ఇచ్చే ప్రజల వివరాలను గోప్యంగా ఉంచే చట్టబద్ధమైన మార్గాలను తెలియజేయాలి. వ్యక్తుల పేర్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం, గుంపులుగా వెళ్లి ఘర్షణలకు దిగడం వంటి చర్యలకు తావుండకూడదు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో నిఘా, ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన ఉండాలి. మరోవైపు యువతకు క్రీడా మైదానాలు, గ్రంథాలయాలు, నైపుణ్య శిక్షణ, వృత్తి మార్గదర్శకత్వం, ఉపాధి సమాచారం అందుబాటులోకి రావాలి. ఇవే మత్తు సమస్యకు ఏకైక పరిష్కారమని చెప్పలేం. అయినా యువతకు సానుకూల అవకాశాలు, కుటుంబ మద్దతు, భవిష్యత్తుపై నమ్మకం కల్పించడం నివారణ ప్రయత్నాలను బలోపేతం చేస్తుంది. తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడపాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో మార్పులను గమనించాలి. పోలీసులు నేరం జరిగిన తర్వాతే స్పందించకుండా ముందస్తు అవగాహనకూ ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యసన విముక్తి సేవలు ఎక్కడ లభిస్తాయో ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలి. సహాయం కోరేవారికి అవమానం కాకుండా అండ లభించాలి.

2029 లక్ష్యానికి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి నుంచే కొలవగల కార్యాచరణను ప్రకటించాలి. జిల్లాలవారీగా బాధ్యతగల అధికారులను నియమించి, నిర్దిష్ట కాలవ్యవధిలో పురోగతిని సమీక్షించాలి. అక్రమ సరఫరా నిరోధం, పాఠశాలల నివారణ కార్యక్రమాలు, చికిత్సా సదుపాయాలు, పునరావాసం, ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్ర నివేదికలను క్రమం తప్పకుండా విడుదల చేయాలి. నమోదైన కేసుల సంఖ్య పెరిగిందా తగ్గిందా అనే ఒక్క అంశంతోనే విజయాన్ని నిర్ణయించకూడదు; గుర్తింపు, ఫిర్యాదుల నమోదు, దర్యాప్తు సామర్థ్యం కూడా గణాంకాలపై ప్రభావం చూపుతాయి. అందువల్ల అందుబాటులో ఉన్న సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించాలి. కేంద్ర-రాష్ట్ర శాఖల మధ్య సమన్వయం, వైద్య సేవల బలోపేతం, విద్యాసంస్థల భాగస్వామ్యం, ప్రజల సహకారం ఒకే దిశలో సాగాలి. మత్తు నిర్మూలనను ఒకరోజు ఉత్సవంగా కాకుండా నిరంతర ప్రజా ఉద్యమంగా మార్చాలి. గవర్నర్ ఆశయాన్ని నిజం చేయాలంటే ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి; అధికారులు ఫలితాలు చూపాలి; కుటుంబాలు పిల్లలకు అండగా నిలవాలి; సమాజం బాధితులను దూరం పెట్టకుండా చికిత్సకు ప్రోత్సహించాలి. పల్లెల్లో యువతకు అవకాశాలు పెరగాలి, అక్రమ మత్తు సరఫరాకు అడ్డుకట్ట పడాలి, చికిత్స కోరేవారికి సహాయం అందాలి. ఇదే నషా ముక్త్ తెలంగాణకు బలమైన పునాది. నినాదం వినిపించడం మొదటి అడుగు మాత్రమే; ప్రతి గ్రామంలో మార్పు కనిపించినప్పుడే లక్ష్యం నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

**"బతుకుకు భరోసా.. మత్తుకు చరమగీతం!"**

**నిషా నిద్దుర లేవరా.. పల్లెలు మేల్కొనరా!**

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.